సాక్షి
జనగామ
శనివారం | 30 | నవంబర్ | 2024



ఉద్యమ కల సాకారం

అయోధ్యపురం వద్ద రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణ పనులు 65 శాతం పూర్తయ్యాయి. 2025 ఆగస్టులో ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. - 8లో▸



ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ప్రాణం తీసింది..

ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళతో ఏర్పడిన పరిచయం ఓ యువకుడి హత్యకు దారితీసిన ఘటన చంద్రుపల్లిలో జరిగింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$28^0/22^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి



చిల్పూరు: చిల్పూరు శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామిని శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీందర్‌శర్మ-సురేఖ దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రధాన అర్చకులు రవీదంర్‌శర్మ, అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వారికి ఆశీర్వచనాలు, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో దివ్యాంగుల ప్రతిభ



జనగామ రూరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఈనెల 22న జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించింది. ఇందులో మొదటి బహుమతి సాధించిన తోట సురేందర్ (ట్రై సైకిల్), జ్యోతి క్యారం, షాట్‌పుట్, శ్రీనివాస్(షాట్‌పుట్).. 27న జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. వారికి డైరెక్టర్ శైలజ శుక్రవారం నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి డి.ఫ్లోరెన్స్ వారిని అభినందించారు.

కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే..



లింగాలఘణపురం: ఆయిల్‌పాం సాగు చేస్తే పంటను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ అన్నారు. శుక్రవారం బండ్లగూడెం రైతు వేదికలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు అందజేస్తుందని, ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ జిల్లా ఇన్‌చార్జ్ శంకర్, ఏఓ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, ఏఈఓలు స్పందన, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పద్మావతి



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన మినుముల పద్మావతి ఐకేపీ వీఓఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. భువనగిరిలో గురువారం జరిగిన ఐకేపీ వీఓఏ(ఇందిరా క్రాంతి పథం విలేజ్ ఆర్గనైజేషన్ అండ్ అసిస్టెంట్)ల సమావేశంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పద్మావతి మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

అనాథ పిల్లలకు రూ.5లక్షలు



పాలకుర్తి: తల్లిదండ్రులను కోల్పోయిన వావిలాలకు చెందిన పిల్లలు వర్షిత్, శ్రీవల్లికి దాతల నుంచి సేకరించిన రూ.5లక్షల చెక్కును శుక్రవారం మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు గంట రవీందర్ అందజేశారు. ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు చెప్పారు. రామ్‌రెడ్డి, పాడిశెట్టి వెంకన్న, మహేందర్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ

జనగామ రూరల్: టాస్క్ ఫోర్స్ అధికారులు ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యాన శుక్రవారం జిల్లాలోని లక్ష్మీ శ్రీనివాస, దేవి, మహేశ్వర, హరిహర ఆగ్రో ఇండస్ట్రీస్‌తో పాటు బాయిల్డ్ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. 2022-23, 2023-24 అలాగే 2024-25 సీజన్లకు సంబంధించిన ధాన్యం నిల్వల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు, రైస్ మిల్లులోని ధాన్యంలో వ్యత్యాసం కనిపించలేదని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. డీటీ సివిల్ సప్లయీస్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ బాలు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

- పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తప్పని ఇబ్బందులు
- ఉన్ని దుస్తులకు పెరుగుతున్న డిమాండ్
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



చలిమంట కాగుతున్న జనం

జనగామ: చలిపులి జనాన్ని గజగజ వణికిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. జిల్లాలో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. కొద్ది రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోతున్నాయి. తెల్లవారుజాము 4 గంటల నుంచి ఉదయం 10 గంటలు, సాయంత్రం 5 నుంచి చలి తీవ్రత అధికంగా ఉంటోంది. పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో మంచు అధికంగా కురుస్తుండడంతో ఉదయం 8 గంటల వరకు రహదారులపై వాహనదారులు హెడ్ లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. చలి తీవ్రతతో చిన్నారుల నుంచి మొదలు వృద్ధుల వరకు.. అలాగే పారిశుద్ధ్య కార్మికులు, రైతులు, కూరగాయల వ్యాపారులు, పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం, తెల్లవారుజామున చలిమంటలతో కొంత ఉపశమనం పొందుతున్నారు. ప్రస్తుత వాతావరణాన్ని పరిశీలిస్తే మరో రెండు నెలల పాటు ఇలాంటి పరిస్థితులు నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జోరందుకున్న స్వెట్టర్ల అమ్మకాలు

చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఒంటినిండా ఉన్ని దుస్తులు లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. స్వెట్టర్లు, దుప్పట్లు, ముఖానికి మాస్కుల అమ్మకాలు జోరందుకున్నాయి. జనగామ పట్టణంలోని హనుమకొండ, హైదరాబాద్, సిద్దిపేట రహదారితోపాటు బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, దేవరుప్పుల, రఘునాథపల్లి మండల కేంద్రాల్లో ఉన్ని దుస్తుల దుకాణాలు తెరుచుకున్నాయి.



ఉన్ని దుస్తుల విక్రయ దుకాణంలో..



తెల్లవారుజామున టీ తాగుతున్న పట్టణ ప్రజలు

జిల్లాలో గత వారం రోజులు నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)

మండలం	కనిష్టం	గరిష్టం
తరిగొప్పుల	18.1	27.0
చిల్పూరు	19.6	24.7
జఫర్‌గఢ్	21.3	28.5
స్టేషన్‌ఘన్‌పూర్	19.0	31.5
రఘునాథపల్లి	17.8	26.8
నర్మెట	19.9	28.5
బచ్చన్నపేట	18.4	27.7
జనగామ	17.8	24.9
లింగాలఘణపురం	19.2	28.1
దేవరుప్పుల	22.1	27.1
కొడకండ్ల	20.5	26.1

జాగ్రత్తలు అవసరం



చలికాలంలో జాగ్రత్తలు తీసుకోకుండా బయటకు వెళితే అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది. తెల్లవారుజాము, రాత్రి సమయంలో ముఖానికి ఉన్ని దుస్తులు ధరించాలి. చిన్నారులను ఆరుబయట తిరగనివ్వొద్దు. జలుబు, జ్వరం, అస్వస్థతకు గురయిన సమయంలో వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. పగటి పూట వీస్తున్న చల్లని గాలులు ప్రమాదకరం. కాచి వడబోసిన నీటినే తాగాలి.

- డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, ఎంఎస్‌డీసీహెచ్, జనరల్ సర్జన్, జనగామ



బస్టాండ్‌లో వృద్ధులు

మాస్టర్ ప్లాన్‌కు డ్రోన్ సర్వే


- పైలట్ ప్రాజెక్టులో జనగామ ఎంపిక
- డిసెంబర్ 9 నుంచి 14 వరకు వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

జనగామ: జనగామ మున్సిపాలిటీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టబోతున్నారు. 2045 వరకు మాస్టర్ ప్లాన్ తయారు చేసేందుకు సిద్ధమవుతున్నారు. 1990లో రూపుదిద్దుకున్న జనగామ మాస్టర్ ప్లాన్‌ను 25 ఏళ్ల తర్వాత తిరిగి రివైజ్ చేయాల్సి ఉంది. నాలుగేళ్ల ఆలస్యంగా 2019లో రివైజ్డ్ మాస్టర్ ప్లాన్ కోసం ఓ కంపెనీ సహకారంతో పట్టాలెక్కించినా.. అనివార్య కారణాలతో మధ్యలోనే నిలిచిపోయి నేటి వరకు పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి కొత్త మాస్టర్ ప్లాన్ తయారీ కోసం డ్రోన్ సర్వే చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసింది. 'ప్లాన్ ప్రకారం నిర్లక్ష్యం' శీర్షికన ఈనెల 29న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ప్రభుత్వం డ్రోన్ సర్వే ద్వారా మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా జీఐఎస్ (డ్రోన్ సర్వే)కు పైలట్ ప్రాజెక్టు కింద జనగామను ఎంపిక చేసింది.

పట్టణ విస్తీర్ణం 19.31 స్క్వేర్ కిలోమీటర్లు

జనగామ పట్టణం 19.31 స్క్వేర్ కిలోమీటర్ల పరిధిలో విస్తరించింది. గృహాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు 10,600లకు పైగా ఉండగా.. పురపాలిక అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఇంటి నంబర్లకు నోచుకోని ఎన్నో నూతన భవనాలున్నాయి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా రెండు దశాబ్దాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కొత్త మాస్టర్‌ప్లాన్-2045 తయారు చేసేందుకు డ్రోన్ సర్వే చేపట్టనున్నారు. డిసెంబర్ 9 నుంచి 14 వరకు పట్టణ పరిధి 30 వార్డుల్లో డిజిటల్ లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో సర్వే పూర్తి చేస్తారు. ప్రతీ అంశాన్ని ఫొటోలతో కేటగిరీల వారీగా సమాచారం సేకరించి బేస్ మ్యాప్‌లను సిద్ధం చేయనున్నారు. ఈ మ్యాపింగ్‌తో రహదారులు, నీటి వనరులు, రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలు, ప్రభుత్వ భూముల వివరాలు, చెరువులు, కెనాల్స్, డ్రెయినేజీ, మౌలిక వసతి సౌకర్యాలు, పార్కుల అభివృద్ధి తదితర అంశాల వారీగా 2045 వరకు చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నూతన మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తారు. అంతకు ముందు డిపార్టుమెంట్ల వారీగా జనగామ పట్టణ సమగ్ర సమాచారాన్ని తీసుకోనున్నారు.



జనగామ పట్టణ వ్యూ

తెలంగాణ కేడర్ ఐఏఎస్‌గా ప్రణయ్‌కుమార్

- శిక్షణ పూర్తవడంతో కేటాయింపు
- రఘునాథపల్లిలో టపానులు పేల్చిన స్థానికులు, కుటుంబ సభ్యులు

రఘునాథపల్లి: ఐఏఎస్‌గా ఎన్నికైన రఘునాథపల్లికి చెందిన కొయ్యడ ప్రణయ్‌కుమార్‌కు సొంత గడ్డపై సేవ చేసే అవకాశం దక్కింది. కేంద్రం ఆయనను తెలంగాణ కేడర్‌కు కేటాయించింది. దీనిపై ప్రణయ్‌కుమార్‌తో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొయ్యడ ప్రభాకర్-లక్ష్మి దంపతుల కుమారుడు ప్రణయ్‌కుమార్ యూపీఎస్సీ పోటీ పరీక్షల్లో 554వ ర్యాంకు సాధించాడు. ఐఏఎస్‌గా ఎంపికైన ఆయన ఇన్నాళ్లు ఉత్తర ప్రదేశ్ లాల్‌బహదూర్ శాస్త్రీ అకాడమిలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఆయనను తెలంగాణ కేడర్‌కు కేటాయిండంపై శుక్రవారం తల్లిదండ్రులతో గ్రామస్తులు బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచారు. రాష్ట్ర ప్రజలకు చేసే చేసే భాగ్యం దక్కడం అదృష్టంగా బావిస్తున్నట్లు ప్రణయ్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.



ఐఏఎస్ కొయ్యడ ప్రణయ్‌కుమార్

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా స్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ బీసీ వసతిగృహాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రీడోత్సవాలను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో గెలుపు ఓటమి సహజమని, ఓటమి చెందిన వారు దిగులు చెందకుండా తమలోని క్రీడానైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రవీందర్, హెచ్‌డబ్ల్యూఓలు లక్ష్మీనారాయణ, నిర్మల, అనిత, డీవైఎస్‌ఓ వెంకట్‌రెడ్డి, పీఈటీలు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. డీపీఓ స్వరూపరాణి, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

జనగామ రూరల్: ప్రజాపాలన విజయోత్సవాలను డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాపాలన విజయోత్సవాలు, మధ్యాహ్న భోజనం, సీఎం కప్ ఆటల పోటీలపై వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి, గ్రామ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతోపాటు ప్రభుత్వ లోగో ఏర్పాటు చేయాలన్నారు. 7, 8, 9వ తేదీల్లో గ్రామ స్థాయి, 10 నుంచి 11 వరకు మండల స్థాయి, 16-21 వరకు జిల్లా స్థాయిలో సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించాలని చెప్పారు. మండల స్థాయిలో ఆహార భద్రత పర్యవేక్షణ కమిటీలను నియమించామని, ఈ కమిటీ నిత్యం జిల్లాలోని అన్ని పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు, వంట గదులు, పరిసరాల పరిశుభ్రతలను పరిశీలించాలని చెప్పారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, సెప్టిక్ ట్యాంక్‌ల మరమ్మతు ఉంటే పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

రైతు పండుగకు 150 మంది రైతులు

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని నేడు(శనివారం) మహబూబ్‌నగర్ జిల్లా ఆమిస్తాన్‌పూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రైతు పండుగ కార్యక్రమానికి జిల్లా నుంచి 150 మంది ప్రగతిశీల రైతులను బస్సుల ద్వారా తీసుకు వెళ్తున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలో వారికి అవగాహన కల్పించేందుకు వ్యవసాయ ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించేందుకు జిల్లాలోని 12 రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు వివరించారు.

తెలంగాణ గాంధీ కేసీఆర్

- ఉద్యమ చరిత్ర ఊరూరా తెలియజేయాలి
- పాలకుర్తి ప్రజలు బ్రోకర్ మాటలు నమ్మారు
- 'దీక్షా దివస్'లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ: తెలంగాణ గాంధీ కేసీఆర్.. ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలను లెక్కచేయకుండా చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజు చరిత్రలో నిలిచి పోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తాలో శుక్రవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'దీక్షా దివస్' కార్యక్రమాన్ని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులతో కలిసి నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు ర్యాలీగా చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. అలాగే కేసీఆర్, తెలంగాణ తల్లి, అమరవీరుల స్తూపానికి పాలాభిషేకం చేశారు. అనంతరం దయాకర్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ దీక్షా దివస్ చేసిన రోజు నాటి ఐదేళ్ల వయసు పిల్లలకు తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలియదని, ఇప్పుడు ఊరూరా తెలియజేసే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల ప్రజలు కేసీఆర్‌ను ఆదరిస్తే, పాలకుర్తి ప్రజలు రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాటలను నమ్మి మోసపోయామని బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపు బీఆర్ఎస్‌దే అన్నారు. ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసే తప్పిదాలపై ప్రజలకు కోపం వస్తే ఏంచేస్తారో లగచర్ల ప్రజలు చూపించారని, అదే స్ఫూర్తితో ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పని చేయాలని అన్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో.. కడియం శ్రీహరి నీతి మాటల్లో అంతే నిజం ఉంటుందని ఎద్దేవా చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆయన చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే బి.భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో పుట్టిన ప్రతీ బిడ్డ ఈరోజు గురించి మర్చిపోవద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. లగచర్ల విషయమై మహబూబాబాద్‌లో కేటీఆర్ ఆధ్వర్యాన తలపెట్టిన ఆందోళనతోనే ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. రాష్ట్రంలో మరోసారి ఉద్యమ చైతన్యం ఘన్‌పూర్ నుంచే ప్రారంభం కాబోతున్నదని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున లింగయ్య, నాయకులు ఇర్రి రమణారెడ్డి, బాల్దె విజయసిద్ధిలింగం, పసుల ఏబేలు, ఎడవల్లి కృష్ణారెడ్డి, గాంధీ నాయక్, మేకల కలింగరాజు, పల్లా సుందర్‌రాంరెడ్డి, గద్దల నర్సింగరావు, సేవెల్లి సంపత్, మసీఉర్ రెహమాన్, ముస్త్యాల దయాకర్, ప్రవీణ్, ఒక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



'దీక్షా దివస్'కు ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపిస్తేనే అభివృద్ధి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్‌లను గెలించుకోవాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్.మంజుల, తొర్రూరు మార్కెట్ చైర్మన్ హనుమండ్ల తిరుపతిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు కుమారస్వామి, సురేష్ నాయక్, నల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: నియోజకవర్గంలో అన్ని హంగులతో కార్పొరేట్ స్థాయి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కాబోతున్నదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కోనాయిచలం రెవెన్యూ పరిధిలోని 21 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆయన కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై దుండగుల దాడి

- మహిళ మెడలోని పుస్తెలతాడు అపహరణ

జనగామ: పట్టణ శివారు వికాస్‌నగర్‌లో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దంపతులపై దాడి చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం జరిగింది. గీతానగర్‌లో నివాసముంటున్న గుజ్జుల లక్ష్మి-వీరస్వామి దంపతులు ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లారు. మొపెడ్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ప్రసాద్ ఇంజనీరింగ్ కళాశాల ఏరియా వద్ద.. ద్విచక్రవాహనంపై వెనక నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు అడ్డగించారు. బైక్ దిగుతూనే మహిళపై దాడి చేసి మెడలోని సుమారు 3 తులాల పుస్తెల తాడు లాక్కెళ్లారు. దీంతో దంపతులు లబోదిబోమంటూ కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ దామోదర్‌రెడ్డి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బాధిత మహిళ లక్ష్మి

గోశాల నిర్మాణానికి రూ.12 లక్షల విరాళం

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గోశాల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన దోర్నాల గోపయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దోర్నాల సోమేశ్వరి, శివప్రసాద్, ప్రగతి, చైత్రిక రూ.12 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం గోశాల భూమి పూజ నిర్వహించారు. ఈఓ మోహన్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు పాల్గొన్నారు.



గోశాలకు భూమి పూజ చేస్తున్న అర్చకులు, దాత

ఆయుర్వేదం గొప్ప వైద్యం

- జిల్లా వైద్యాధికారి రవీందర్‌గౌడ్

జనగామ: ఆయుర్వేదం.. రోగాలను తగ్గించుకోవడంతో పాటు రాకుండా చేసుకునే గొప్ప వైద్యమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రం హైదరాబాద్‌రోడ్డులోని వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్ 8వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యంతో దీర్ఘ కాలిక రోగాలను సైతం నయం చేసుకోవచ్చన్నారు. డాక్టర్ అంజిరెడ్డి మాట్లాడుతూ ఈ వార్షికోత్సవం సందర్భంగా 2025 నవంబర్ వరకు 0 నుంచి 16 ఏళ్ల వయస్సు పిల్లలకు ఉచితంగా స్వర్ణప్రాశన అందజేస్తామన్నారు. వేద సెంటర్ వద్ద బస్టాప్ లేకపోవడంతో ముగ్గురు సిబ్బందికి ఉచితంగా మూడు ఎలక్ట్రిక్ బైక్‌లు ఇచ్చామని పేర్కొన్నారు. జనగామ తహసీల్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ప్రజా పోరాటాలే పాలకవర్గాలను కదిలిస్తాయి

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

పాలకుర్తి టౌన్: ప్రజా పోరాటాలే పాలక వర్గాలనకు కదిలిస్తాయి.. ఇందుకు లగచర్ల ఘటనే ఉదాహరణ అని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. శుక్రవారం స్థానిక శుభం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను అన్నదాతలు వ్యతిరేకించడంతో ఉపసంహరించుకుందన్నారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాల్లో భవిష్యత్ ఉద్యమాల కార్యాచరణను రుపొందిస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనె కుమారస్వామి, వనం సుధాకర్, కుంభం సుకన్య, పెద్దాపురం రమేష్, రెడ్డి హంసారెడ్డి, మంద రవి, నజీర్, రాగసుధ, మాలోత్ జబ్బార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ కల్యాణం

జనగామ: జనగామ పట్టణంలోని హెడ్‌పోస్టాఫీసు ఏరియా శ్రీ సంతోషిమాత సహిత శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం శివ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసశర్మ బృందం ఆధ్వర్యాన కల్యాణం పూర్తయిన తర్వాత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి పట్టువస్త్రాలు, కట్నకానుకలు సమర్పించారు.

క్లుప్తంగా

నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్, వరంగల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ స్మారకార్థం నిర్వహించే టోర్నమెంట్ ఈ నెల 30 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు ఓపెన్ మెన్స్ కేటగిరీలో జరగనున్నట్లు వెల్లడించారు. సుబేదారిలోని వరంగల్ క్లబ్ వేదికగా జరిగే టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.2.5 లక్షల నగదు పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ ప్రావీణ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దహనం

- రూ.2లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఇంటి ఎదుట బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని నమిలిగొండలో ప్రమాదవశాత్తు బోనగిరి సాంబరాజుకు చెందిన ఇల్లు, ఇంటిలో వస్తువులు దహనమై రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితులు సాంబరాజు, అపర్ణ దంపతులు తెలిపిన వివరాలు ప్రకారం.. నమిలిగొండ గ్రామానికి చెందిన సాంబరాజు హమాలీ పని చేస్తుండగా అతని భార్య వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం వారు పనులకు, పిల్లలు పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని టీవీ, మంచాలు తదితర ఫర్నీచర్, దుస్తులు, బియ్యం బస్తాలు, రూ.30వేలు నగదు కాలిబూడిదయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు సాంబరాజుకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మంటలను అదుపుచేశారు. కానీ, అప్పటికే వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, సామగ్రి కాలిపోవడంతో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పురమాని రజాక్‌యాదవ్, కాంగ్రెస్ నాయకుడు కుందూరు అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి రూ.5వేలు అందించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాయం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాజీపేట మండలం అయోధ్యపురంలో కొనసాగుతున్న రైల్వే వ్యాగన్ షెడ్ నిర్మాణాలు





ఉద్యమ కల సాకారం

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం 45ఏళ్లు సాగిన పోరాటం

- 1977–1978లో ఆజంజాహి మిల్లులో కార్మికుల తొలగింపుతో తెరపైకి కోచ్ ఫ్యాక్టరీ నినాదం
- 1979లో కమ్యూనిస్టులు భగవాన్‌దాస్, కాళిదాస్ ఆధ్వర్యంలో ఉద్యమం
- తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర విభజన చట్టంలో కీలక అంశంగా కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన
- కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ కోసం 13 ఏళ్లు పోరాడిన రైల్వే జేఏసీ
- పీపుల్స్‌వార్, మావోయిస్టుల మద్దతు



కాజీపేట రూరల్: ఉమ్మడి జిల్లా ప్రజల ఉపాధికి పెద్దదిక్కుగా ఉన్న నాటి ఆజంజాహి మిల్లులో కార్మికుల సంఖ్యను మెల్లమెల్లగా తగ్గిస్తున్న నేపథ్యంలో.. నాటి కామ్రేడ్లు భగవాన్‌దాస్, కాళిదాస్ ఉమ్మడి జిల్లాలో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తెరపైకి తీసుకొచ్చారు. ఊరూరా ఉద్యమించి గల్లీ నుంచి ఢిల్లీ వరకు కోచ్ ఫ్యాక్టరీ నినాదాన్ని తీసుకెళ్లి సక్సెస్ అయ్యారు. వారి పోరాట స్ఫూర్తితో రాజకీయ పార్టీలు, సంఘాలకు అతీతంగా కాజీపేట, వ్యాగన్ షెడ్, కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్ కోసం కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు 13 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేశారు. ఈనేపథ్యంలో రైల్వే వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నెరవేరనున్న కల

పదమూడున్నరేళ్ల రైల్వే జేఏసీ ఉద్యమంతో కాజీపేటకు రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, నేడు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు బాటలు పడ్డాయి. దీంతో నాలుగు దశాబ్దాల కల సాకారం కానుందని ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆజంజాహి కార్మికుల తొలగింపు.. కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం..

జిల్లాలోని ఆజంజాహి మిల్లులో 1977–78లో కార్మికుల తొలగింపు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తే జిల్లాలో కొంత వరకు నిరుద్యోగ సమస్య తీరుతుందని గ్రహించిన నాటి కామ్రేడ్లు భగవాన్‌దాస్, కాళిదాస్ 1978లో ఉద్యమం చేపట్టారు. ఊరూరా సైకిల్ యాత్రలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేశారు. బ్రిటీష్, నిజాం సర్కార్ కాలంలో ఇల్లందులో బొగ్గగనుల కేంద్రం నుంచి బొగ్గ గనులు తీసి, ట్రిన్ కోచ్ షీట్స్ హీట్ చేసేవారు. ఇల్లందులో కోల్ మైనింగ్ కేంద్రం ఉంది.. కావున కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలనే ఉద్యమం ఎగిసింది. కాజీపేట– మద్రాస్ వరకు అప్పట్లో సింగిల్‌లైన్ ఉంది. జిల్లాలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమిస్తున్న సమయంలోనే మద్రాస్‌లో వ్యాగన్ వర్క్ షాప్ నెలకొల్పారు. తర్వాత కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఇది కూడా జిల్లా నుంచి మద్రాస్‌కు కోచ్ ఫ్యాక్టరీ తరలిపోయిందని చెప్పవచ్చును. ఈక్రమంలో 1982లో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం తీవ్రంగా సాగింది. అదే సమయంలో జిల్లాకు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కూడా మంజూరు అయి తెరమరుగైంది.

వ్యాగన్‌షెడ్ నిర్మాణం

అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

2009లో వ్యాగన్ షెడ్ మంజూరు

కాజీపేట రైల్వే డివిజన్, కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ నేపథ్యంలో 2009లో నాటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ హయాంలో కాజీపేటకు రైల్వే వ్యాగన్ షెడ్ మంజూరైంది. తర్వాత కాజీపేటలో ఎలక్ట్రిక్ షెడ్ నిర్మాణం జరిగింది. 2011లో తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు నేతృత్వంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్ ప్రస్తావన బలంగా ముందుకు సాగింది. తర్వాత్తర్వాత రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ప్రస్తావన రాజకీయ అంశంగా మారి తెలంగాణ ఉద్యమంలో ప్రధాన డిమాండ్లుగా నిలిచాయి.

1983లో కమిటీ ఏర్పాటు

ప్రధానిగా ఇందిరాగాంధీ ఉన్న సమయంలో కెబినెట్‌లో తెలంగాణ నుంచి మానవవనరుల శాఖ మంత్రిగా పీవీ నర్సింహారావు కొనసాగారు. ఆసమయంలో భగవాన్‌దాస్, కాళిదాస్‌ల పోరాటంతో 1983లో జిల్లాలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని ఇందిరాగాంధీ కమిటీ వేసింది. భూసేకరణ కూడా జరిగింది. అదే ఏడాది (1983)లో ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల్లో జిల్లా నుంచి పీవీ నర్సింహారావు ఓటమి చెందారు. బీజేపీ, టీడీపీ అలయన్స్‌తో కోచ్ ఫ్యాక్టరీ నినాదంతో జంగారెడ్డి ఎంపీ అయ్యారు. హనుమకొండ నుంచి ఓటమి చెందిన పీవీ.. నాగపూర్ రాంటెక్ నుంచి విజయం సాధించారు.

ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్

కాజీపేటలో వ్యాగన్ షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా కేంద్రం కాజీపేటకు ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థ కాజీపేట వ్యాగన్‌షెడ్‌లో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీకి రూ.580 కోట్లు, మరో దఫా రూ.66 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సైతం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాజీపేట రైల్వే డివిజన్‌కు కావాల్సిన సరిహద్దులు ఏర్పాటు చేయాలని రైల్వే జీఎంకు ఆదేశాలు జారీ చేసింది. కాజీపేట వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి లభించనుంది

స్థానికులకు ఉపాధి కల్పించాలి



పంజాబ్‌లోని కపుర్తాల కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలు భర్తీ చేసిన విధంగానే కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్, కోచ్‌ఫ్యాక్టరీలో స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి. లేదంటే ఉద్యమిస్తాం. కేంద్ర ప్రభుత్వం రెండు రైల్వే పరిశ్రమలను నెలకొల్పుతున్నందుకు, స్థలం ఇచ్చిన ఆనాటి రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వే జేఏసీ తరపున కృతజ్ఞతలు.

– దేవులపల్లి రాఘవేందర్, రైల్వే జేఏసీ కన్వీనర్

ప్రజా ఉద్యమాలదే విజయం



జిల్లాలో 45 ఏళ్ల ప్రజా ఉద్యమ చరిత్ర గల రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్ మంజూరుకు ఆనాడు చేస్తున్న అనేక ఉద్యమాలకు పీపుల్స్‌వార్ సైతం మద్దతు ప్రకటించారు. రైల్వే జేఏసీ రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే వ్యాగన్ షెడ్, కాజీపేట డివిజన్ ఏర్పాటు కోసం చేస్తున్న ఉద్యమాలకు మావోస్టు పార్టీ కూడా మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించడం జరిగింది. ప్రజా ఉద్యమాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయి.

– కొండ్ర నర్సింగరావు, రైల్వే జేఏసీ చైర్మన్

ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ప్రాణం తీసింది..

- మహిళ వద్ద అప్పు తీసుకున్న యువకుడు
- ఫోన్ సంభాషణలతో అనుమానం పెంచుకున్న మహిళ భర్త
- ప్లాన్ ప్రకారం యువకుడి హత్య
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు

కాళేశ్వరం: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మహిళ వడ్డీలకు అప్పులు ఇస్తుందని తెలుసుకున్న ఓ యువకుడు ఆమె సోదరుడి ద్వారా రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఈక్రమంలో మహిళతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. దీంతో ఆమె భర్తకు అనుమానం పెరిగి అపార్థం చేసుకొని యువకుడిని హత్య చేశాడు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో గత బుధవారం జరిగిన ఈ హత్యకు సంబంధించి శుక్రవారం రాత్రి కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన ముత్యాల శ్రీకాంత్ గౌడ్(24) పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు పొన్నం శివకృష్ణగౌడ్ భార్యతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నాడు. ఆ మహిళ సోదరుడు పవన్, శ్రీకాంత్‌గౌడ్ ఇద్దరూ స్నేహితులు కావడంతో ఆమె వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఆ అప్పు విషయంలో వారిద్దరు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. గమనించిన ఆమె భర్త పలుమార్లు మహిళను మందలించాడు. ఫోన్‌లో మాట్లాడడంతోపాటు, వారిద్దరు దగ్గరయ్యారనే అనుమానంతో శివకృష్ణ, అతని స్నేహితుడు ఎండీ ఫయాజ్‌తో కలిసి శ్రీకాంత్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కొమ్మెర గ్రామానికి చెందిన కిరాణ దుకాణం నిర్వాహకుడు కురుమ సాయితో పరిచయం పెంచుకుని శ్రీకాంత్ కదలికలను తెలుసుకున్నాడు. ఈ నెల 27వ తేదీన (బుధవారం) గ్రామంలో రెక్కీ నిర్వహించగా అక్కడ లేడని, అన్నారం సమీపంలోని చంద్రుపల్లిలో హార్వెస్టర్ నడిపిస్తున్నట్లు సాయి తెలిపాడు. దీంతో శివకృష్ణ, అతని స్నేహితుడు ఫయాజ్.. సాయి దుకాణంలో బీర్లు, ఆ తర్వాత కల్లు తాగి మహదేవపూర్ మండలం చంద్రుపల్లికి వచ్చారు. అక్కడ హార్వెస్టర్ డ్రైవర్ కోసం తన కారులో వేచి చూస్తున్న శ్రీకాంత్‌తో గొడవపడ్డారు. వెంటతెచ్చుకున్న కత్తితో ఛాతి, కడుపులో విచక్షణారహితంగా పొడవగా శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందడంతో బైక్ వదిలేసి పారిపోయారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. హత్యచేసిన రోజు ధరించిన రక్తపుదస్తులు, కత్తి, హెల్మెట్ దాచి ఉంచిన స్థలానికి శుక్రవారం నిందితులు చేరుకోగా చంద్రుపల్లి వద్ద మహదేవపూర్ సీఐ రామచంద్రరావు, ఎస్సైలు చక్రపాణి, పవన్‌కుమార్, తమాషారెడ్డిలతోపాటు పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి పల్సర్ బైక్, కత్తి, రక్తపు మరకలతో ఉన్న దుస్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పేదింటికి పెద్ద జబ్బు



- రెండు కిడ్నీలు పోయి.. మంచంపట్టి..
- డయాలసిస్‌తో నెట్టుకొస్తున్న యువకుడు
- కిడ్నీ ఇచ్చేందుకు సమ్మతించిన తండ్రి
- ఆర్థిక స్థోమత లేక ఆపరేషన్‌కు దూరం



ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న ఉపేందర్

కురవి: భార్య, ఇద్దరు పిల్లలతో హాయిగా జీవిస్తున్న ఓ పేదింటి యువకుడు రెండు కిడ్నీలు చెడిపోయి మంచం పట్టాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన ఇటికాల వెంకటయ్య–ఉప్పలమ్మల పెద్ద కుమారుడు ఉపేందర్ మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. అదే ఆస్పత్రిలో భార్య పార్వతి ఏఎన్‌ఎంగా పనిచేస్తోంది. వీరికి అర్షిత 8వ తరగతి, నందిత 3వ తరగతి ఉన్నారు. ఉపేందర్‌కు 8 నెలల క్రితం ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రిలో చెక్ చేయించుకున్నాడు. కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. దీంతో హైదరాబాద్‌లో మరోమారు పరీక్ష చేయించాడు. అక్కడ కూడా అదే విషయాన్ని చెప్పిన వైద్యులు డయాలసిస్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈనేపథ్యంలో 8 నెలల నుంచి వారానికి రెండు సార్లు మానుకోటలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. నిత్యం ఆస్పత్రికి వెళ్లడం.. అనారోగ్యంపాలు కావడంతో భార్యభర్తలు ఆస్పత్రిలో ఉద్యోగం మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఈక్రమంలో ఆపరేషన్ చేస్తే ఒక్క కిడ్నీతో బతకవచ్చని డాక్టర్లు చెప్పారు. కానీ, కుటుంబాన్ని పోషించడమే భారంగా మారిన ఉపేందర్‌కు ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేకపోవడంతో దుఃఖసాగరంలో మునిగిపోయాడు.

ఆపరేషన్‌కు రూ.8 లక్షలు..

రెండు కిడ్నీలు చెడిపోయి మంచంపట్టిన కుమారుడిని పరిస్థితిని చూసిన తండ్రి వెంకటయ్య కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. కానీ, కిడ్నీ మార్పిడికి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ ఆరోగ్యశ్రీలో చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇద్దరిలో ఒకరికే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వైద్యులు చెప్పడంతో ఆర్థికస్థోమత లేని ఉపేందర్ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు ఆదుకోవాలని ఉపేందర్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దాతలు 97046 10919 ఫోన్ పే నంబర్‌కు తోచిన సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



రవి(ఫైల్)

విద్యుదాఘాతంతో వ్యక్తి..

భూపాలపల్లి రూరల్: అడవిపందుల కోసం వేసిన విద్యుత్ తీగలకు తగిలి రైతు మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరేడుపల్లి గ్రామ శివారులమేకల రవి(36) అనే రైతు శుక్రవారం మధ్యాహ్నం తన వ్యవసాయ భూమి వద్దకు బయలుదేరాడు. ఆదేగ్రామానికి చెందిన వెంబడి సమ్మయ్య, ఎంబడి శీనులు అడవి పందుల కోసం పెట్టిన కరెంటు వైర్‌లను నిర్లక్ష్యంగా వదిలేశారు. రవి ఆ తీగలకు తగిలి చనిపోయాడు. ఈ మేరకు మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు సీఐ నరేష్ తెలిపారు.మృతుడికి ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు.

గడ్డిగూడెం తండాలో..



వీరన్న (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మహబూబాబాద్ మండలంలోని గడ్డిగూడెం తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని గడ్డిగుడెం తండా గ్రామానికి చెందిన ధరావత్ వీరన్న (45) పొలం పనులకు వెళ్లివచ్చి స్నానం కోసమని నీళ్ల హీటర్తో వేడి చేసుకున్నాడు. ఈక్రమంలో బకెట్ నుంచి హీటర్ తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై శరీరంపై తీవ్ర గాయాలై పడిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు వచ్చి చూసేలోగా వీరన్న మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా బ్లూకోల్ట్స్ పీసీలు విజయ్, సంపత్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ వెంకటేశ్, సిబ్బంది సాగర్ ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ..



రమేశ్(ఫైల్)

టేకుమట్ల: అంత్యక్రియలకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బండపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండల కేంద్రానికి చెందిన తాటికంటి రాజయ్య మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు.. మొగుళ్లపల్లి మండలంలోని నర్సింగాపూర్‌కి చెందిన శనిగరపు రమేశ్(45) హాజరై, టేకుమట్ల మండలంలోని కుందనపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బండపల్లి శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బురదలో పడిపోయాడు. దీంతో ఊపిరాడక మృతి చెందాడు. కాగా, బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్న రమేశ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- అనాథలైన పిల్లలు
- గూడ్స్ వాహనం డ్రైవర్ అజాగ్రత్తతో ప్రమాదం



సుభాన్(ఫైల్)



సబ్రిన్(ఫైల్)



తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులు నవాజ్, సోని

గీసుకొండ: సాఫీగా సాగుతున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు చిన్నాభిన్నం చేసింది.. ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కోటగండి సమీపంలో పీడీఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట వరంగల్–నర్సంపేట రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి, మృతుల బంధువులు, గీసుకొండ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఉర్సు దర్గాకు చెందిన ఎండీ సుభాన్(35), సబ్రిన్ (29) అనే దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తలు ఉదయం తమ కొత్త సీఎన్‌జీ ఆటోలో పిల్లలు సుమాయ, సోని, నవాజ్‌లను ఎక్కించుకుని నగరంలోని స్కూల్‌లో వదిలిపెట్టారు. అనంతరం గీసుకొండ మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారిలో ధర్మారం తండా సమీపంలో సీఎన్‌జీ బంక్‌లో గ్యాస్ నింపుకుని ఉదయం 11.10 గంటల సమయంలో తిరిగి వరంగల్ నగరానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పీడీఆర్ గార్డెన్స్ వద్ద వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న సరుకుల రవాణా ట్రక్కు డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వారి ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సబ్రిన్ అక్కడే మృతి చెందగా, సుభాన్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సుభాన్ మామ ఎండీ సోఫీ ఫిర్యాదు మేరకు ట్రక్ డ్రైవర్ గడ్డం జస్వంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి చాపర్తి ముక్తానంద్(19) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గీసుకొండ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముక్తానంద్ కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు, రక్త కణాలు తగ్గిపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి తండ్రి చాపర్తి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.